సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. కోకకోలా, అపర్ణ ఫీడర్ల పరిధిలోని ఎన్‌జీఆర్ కన్‌స్ట్రక్షన్స్, కోకకోలా చౌరస్తా, కోకకోలా ఇండస్ట్రియల్ ఏరియా, అపర్ణ కంపెనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. అదే విధంగా 11 కేవీ ఎస్ఎంఎస్ ఫీడర్ పరిధిలోని బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియాలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రుణాల్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి



కుత్బుల్లాపూర్: రుణాలను సకాలంలో చెల్లిస్తే మరిన్ని అందించేందుకు ఆస్కారం ఏర్పడుతుందని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ గాజులరామారం శాఖ మేనేజర్ చుల్లేటి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్‌కు చెందిన లక్ష్మి దివ్యాంగుల సంఘానికి రూ.2లక్షలు, తులసి సీఐజీ సంఘానికి రూ.2 లక్షల చొప్పున బ్యాంక్ రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ... దివ్యాంగులు తీసుకున్న రుణాల్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారి బట్టల పాపన్నగౌడ్, రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'వైఎస్సార్‌టీపీ రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా ఆవిర్భవిస్తుంది'



పాదయాత్రకు తరలిన పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్: వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపడుతున్న పాదయాత్రలో భాగంగా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన కోఆర్డినేటర్ సాతాల గోపాల్‌తో పాటు పార్టీ కార్యకర్తలు వరంగల్ జిల్లా మదికొండకు వెళ్లి పాదయాత్రలో పాల్గొన్నారు. పార్టీ అధినేత షర్మిల చేపడుతున్న పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. తప్పకుండా తెలంగాణలో తిరుగులేని శక్తిగా పార్టీ ఆవిర్భవిస్తుందని సురేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

జీఓ.59 నోటీసులు అందుకున్న వారి సందేహాల నివృత్తి



నోటీసులు అందుకున్న వారి సందేహాలను నివృత్తి చేస్తున్న ఆర్ఐ పరమేశ్వర్‌రెడ్డి

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ కోసం జీఓ.59 కింద డిమాండ్ నోటీసులు అందుకున్న వారికి కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. రెండు రోజుల నుంచి మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. తాజాగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌లో జీఓ. 59 కింద డిమాండ్ నోటీసులు అందుకున్న వారితో సమావేశం ఏర్పాటు చేసి వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును నిర్దేశిత గడువులోపు 3 వాయిదాల పద్ధతిన చెల్లించాలన్నారు. డబ్బులు ఎక్కువ కట్టాలని మెసేజ్ వచ్చినప్పటికీ మొదటగా వాయిదా చెల్లించాలన్నారు. తదనంతరం దిద్దుబాటు చర్యలు ఉంటాయని తెలిపారు.

పరామర్శ



టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాతృమూర్తి కాసాని కౌసల్య చిత్రపటానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్, కాసాని వీరేష్‌ముదిరాజ్‌లను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. - నిజాంపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయం



రేవంత్‌రెడ్డి పాదయాత్ర విజయవంతం కావాలని ఆలయంలో పూజలు చేస్తున్న భూపతిరెడ్డి

దుండిగల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తలపెటిన హాత్‌సే హాత్ జోడో పాదయాత్ర విజయవంతం కావాలని సోమవారం సూరారం కట్ట మైసమ్మ ఆలయంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు రేవంత్‌రెడ్డి ఈ యాత్ర చేపట్టారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు సదానందం, మాజీ కౌన్సిలర్ వరమ్మ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాంద్ పాషా, మాజీ వార్డు మెంబర్ పరశురామ్, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇరుగు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. తదనంతరం మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయం నుంచి పాదయాత్ర నిర్వహించడానికి బయలుదేరిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉద్రిక్తతల నడుమ హాత్ సే.. హాత్ జోడో

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభమైన 'హాత్ సే హాత్ జోడో' యాత్రతో ఉద్రిక్త పరిస్థితులను నెలకొన్నాయి. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీ ప్రాంతంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నారెడ్డి, కాంగ్రెస్ నేత కొలన్ హన్మంతరెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు పాదయాత్రగా వెళ్తుండగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు అడుగడుగునా అడ్డు తగలారు. గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఇరుపార్టీల నాయకుల పరస్పరం నినాదాలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా వెంటనే స్థానికులు 100 డయాల్ చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇలా కొద్దిసేపు పరస్పరం వాదోపవాదాలు చేసుకున్నా అనంతరం ఏడుగురు తమ యాత్రకు అడ్డు తగిలారని కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై పేట్‌బషీరాబాద్ సీఐ ప్రశాంత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమం ఎటువంటి అనుమతి లేకుండా నిర్వహించారని అన్నారు. అనుమతి కోరితే తప్పకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

విద్యార్థులను అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నాం



విజేతలుగా నిలిచిన జట్ల సభ్యులతో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు

దుండిగల్: విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు అంతర్జాతయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నామని ఎంఎల్ఆర్ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన వివిధ క్రీడా పోటీల్లో ఎంఎల్ఆర్ఐటీ కళాశాల జట్లు విజేతగా నిలిచాయి. బాస్కెట్‌బాల్‌లో ఎంఎల్ఆర్ఐటీ జట్టు రన్నరప్‌గా నిలవగా రామయ్య యూనివర్సిటీ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రావులు విజేతలుగా నిలిచి జట్ల సభ్యులను అభినందించారు.

◆ ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా సదుపాయాలు అందుబాటులో ఉంచడమే కాకుండా ప్రతి విభాగానికి అనుభవజ్ఞుడైన కోచ్‌తో శిక్షణ ఇప్పిస్తున్నామని పేర్కొన్నారు. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ మా కళాశాల విద్యార్థి కావడం గర్వంగా ఉందన్నారు. ప్రతి ఏటా రూ.1.25 కోట్లను క్రీడాకారులకు ఉపకార వేతనాలుగా అందిస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ్ గోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇటీవల కళాశాల జట్లు సాధించిన విజయాలు

◆ ఫుట్‌బాల్‌లో 2-0 గోల్స్‌లో లయోలా కళాశాలపై విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది.

◆ కబడ్డీలో వీబీఐటీ జట్టుపై 25-5 పాయింట్లలో గెలుపొంది మూడో స్థానంలో నిలిచింది.

◆ సీవీఆర్ స్పోర్ట్స్ ఫెస్ట్‌లో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో ఎంఎల్ఆర్ఐటీ జట్టు 25-16, 25-18 పాయింట్లతో సీవీఆర్ కళాశాలపై విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.

◆ కేఎల్ యూనివర్శిటీలో జరిగిన కబడ్డీ పోటీల్లో కేఎల్ జట్టుపై విజయం సాధించి మూడో ప్లేస్‌తో సరిపెట్టుకుంది.

'వీఎన్ఆర్ యాజమాన్యం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించింది'

- నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్
- ప్రజావాణిలో మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

నిజాంపేట్: బాచుపల్లి సర్వే నం.137, 138, 139 లలో వీఎన్ఆర్ కళాశాల, వీఎన్ఆర్ స్కూల్ యాజమాన్యాలు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని.. వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

◆ ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... సర్వే నంబరు 186లోని ప్రభుత్వ భూమి 1.36 కళాశాల ప్రహరీ లోపల ఉందన్నారు. ఇదే విషయమై 2021లో అప్పటి కలెక్టర్ వాసం వెంకటేశ్వరరావు లక్షల విలువ చేసే స్థలాన్ని గజం 3వేల చొప్పున రెగ్యులరైజ్ చేయాలని రాశారన్నారు. అయితే హెచ్ఎండీఏ అధికారులు దొడ్డిదారిన నిర్మాణానికి అనుమతి ఇచ్చారని తెలిపారు. దీనిపై సర్వే చేసి ప్రభుత్వ భూమి కాపాడాలన్నారు.

రికార్డుల ప్రకారం 36 ఎకరాలు..

కానీ 45 ఎకరాల్లో విస్తరించి ఉంది..

◆ వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల 137/1,138/2, 139/2 సర్వే నంబర్లలో, వీఆర్ఎస్ స్కూల్ 138/1,139/1 సర్వే నంబర్లులో రెవెన్యూ రికార్డుల ప్రకారం మొత్తం 36 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్నాయని తెలిపారు. కానీ దాదాపు 45 ఎకరాల స్థలంలో పూర్తి కాంపౌండ్ వాల్ నిర్మించారని పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కనీసం మున్సిపల్ టాక్స్ చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కబ్జాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మయ్య, ప్రసాద్ రాజు, అశోక్ నాయక్ తదితరులు ఉన్నారు.

సక్రమంగా జీతాలు చెల్లించాలి

దుండిగల్: సక్రమంగా జీతాలు చెల్లించడంటూ సోమవారం భౌరంపేట్‌లోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ.. గత కొంత కాలంగా స్కూల్ యాజమాన్యం జీతాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తోందన్నారు. జీతంపైనే ఆధారపడ్డ తాము కుటుంబాన్ని ఎలా పోషించాలన్నారు. విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ తమకు మాత్రం జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.

ఘనంగా మల్లన్న జాతర



దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డీపోచంపల్లిలో సోమవారం మల్లన్న జాతర ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. మల్లన్న ఆశీర్వాదంతో ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ నాయకులు మల్లేష్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, లక్ష్మణ్, సంతోష్, శ్రీకాంత్, హర్ష, పుల్లారావు, మల్లారెడ్డి, రవిరెడ్డి, అభినందన్‌రెడ్డి, అనీల్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ ఆలయంలో పూజలు



సుభాష్‌నగర్: సంత్ రవిదాస్ గురూజీ జయంతిని పురస్కరించుకొని సోమవారం చంద్రగిరినగర్‌లోని సంత్ రవిదాస్ ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. కార్పొరేటర్ రావుల శేషగిరి, బీఆర్ఎస్ నాయకులు సాయిప్రతాప్, రావుల పృథ్వీ, నవాబ్, చందు, భరత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సైన్‌ఫేర్‌లతో విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుతుంది



నమూనాలను తిలకిస్తున్న ఎంఈఓ ఆంజనేయులు,వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు

జగద్గిరిగుట్ట: సైన్స్‌ఫేర్, ఎడ్యుకేషన్ ఫెస్ట్‌లతో విద్యార్థుల్లో మేధోశక్తి పెరుగుతుందని కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి ఆంజనేయులు అన్నారు. సోమవారం జగద్గిరిగుట్టలోని సాయి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్, మేడ్చల్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఫెస్ట్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ, మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను తిలకించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి సైన్స్ ఫేర్‌లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల కరెస్పాండెంట్లు వినోద్ జాదవ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు రజిత, కృష్ణవేణి, రత్నకుమారి, ప్రశాంతి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి, రచయిత దరువు అంజన్నకు నంది అవార్డు



నంది అవార్డు అందుకున్న దరువు అంజన్న

కుత్బుల్లాపూర్: తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ప్రజాకవి, రచయిత దరువు అంజన్నకు నంది అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా గాయని విమలక్క మాట్లాడుతూ... మలిదశ తెలంగాణ ఉద్యమం సిద్దిపేట కేంద్రంగా తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో దరువు అంజన్న పోరాటాలు సాగించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం మొత్తం పల్లెపల్లెకు తిరిగి ఉద్యమ భావజాలాన్ని, తెలంగాణ వెనుకబాటుతనాన్ని తన పాటల ద్వారా వినిపించి ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చాడని కొనియాడారు. అనంతరం స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ.. దరువు అంజన్న తెలంగాణ అందరికి సుపరిచితుడన్నారు. అంజన్న త్యాగం వెలకట్టలేనిదని ఇలాంటి త్యాగధనులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దమ్మన్నపేట రాజు, బుల్లెట్ వెంకన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి



నిజాంపేట్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ కాలనీలోని రోడ్డు నంబరు 8లో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కాలనీ అధ్యక్షుడు సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడూరి వెంకటేష్, కాలనీ సభ్యులు తదితరులు ఉన్నారు.

పన్నుల వసూళ్లలో దూకుడు పెంచాలి

కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరం రెవెన్యూ టార్గెట్‌ను పూర్తి చేసే విధంగా బిల్ కలెక్టర్లు, సిబ్బందితో కమిషనర్ శ్రీహరి సోమవారం ప్రత్యేకంగా సమావేశమై టార్గెట్లు విధించారు. మొత్తం ఆరుగురు బిల్ కలెక్టర్లు కలిపి రోజువారీగా 5 లక్షల 64వేల 398 రూపాయల పన్నులు వసూలు చేయాలన్నారు. కిందిస్థాయి సిబ్బందిని సహాయకులుగా నియమించుకుని పన్నుల వసూళ్లలో దూకుడు పెంచాలని సూచించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం మార్చి 31 వరకు 9 కోట్ల 28 లక్షల 28వేల 572 రూపాయల టార్గెట్‌ను పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. వ్యాపార, వాణిజ్య, గృహ యజమానులు సహకరించి పనులు చెల్లించాలని శ్రీహరి కోరారు.

◆ ఇప్పటి వరకు 60 శాతం పన్నులు 5 కోట్ల 89 లక్షల 64వేల 691రూపాయల రెవెన్యూ వసూలు అయ్యాయని, మరో 50 రోజుల్లో మిగిలిన 40 శాతం 33 లక్షల 86వేల 3వేల 880 రూపాయల పన్నులు వసూలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మొత్తం 14 వేలకు పైగానే వ్యాపార, వాణిజ్య, గృహాలు ఉన్నాయని దూలపల్లి, కొంపల్లిలతో పాటు వివిధ కాలనీలలో ప్రత్యేకంగా రోజువారి టార్గెట్‌తో ముందుకు సాగుతున్నట్లు వివరించారు.

క్రైం కార్నర్..

యువతి ఆత్మహత్య



సాధన (ఫైల్)

కుత్బుల్లాపూర్: మొబైల్ ఫోన్ చూడొద్దని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి గ్రామంలో నివసించే మూర్తి కుమార్తె సాధన ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తోంది.అయితే తరచూ కుమార్తె మొబైల్ వాడుతుండటంతో ఈ విషయమై తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన సాధన ఈనెల 5వ తేదీ రాత్రి 7గంటల ప్రాంతంలో బెడ్‌రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు యువతిని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి తండ్రి మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

కుత్బుల్లాపూర్: భార్యతో గొడవపడిన భర్త ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి సెంట్రల్ పార్క్ ప్రాంతంలో నివాసముండే సెక్యూరిటీ గార్డు రాములు(46), జయ భార్యాభర్తలు. కాగా పీఎఫ్ డబ్బుల విషయమై భార్యాభర్తల మధ్య ఈనెల 4వ తేదీన వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో 5వ తేదీన పాల ప్యాకెట్ తీసుకువస్తానని చెప్పి బయటకు వెళ్లి రాము ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అతని కోసం వెతకినా ఫలితం లేకపోయింది. దీంతో కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

41 కిలోల డ్రై గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

నిజాంపేట్: గంజాయి విక్రయదారుడి నుంచి 41 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాచుపల్లి ఎస్ఐ సాయినాథ్‌కు టీఎస్ 13 ఈయూ0707 కియా కారులో బాచుపల్లి కేఆర్‌సీఆర్ కాలనీలోని ఎస్వీ రెసిడెన్సీ సమీపంలో గంజాయి అక్రమ విక్రయదారుడు వస్తున్నట్లు సమాచారం అందింది.

◆ దీంతో ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో ఎస్ఐ సాయినాథ్, మరో ఇద్దరు మీడియేటర్లు రాఘవేంద్రప్రసాద్, అగం విజయ్‌లతో కలిసి బాచుపల్లిలోని కేఆర్‌సీఆర్ కాలనీ జంక్షన్‌కమాన్ వద్ద మాటు వేసిన పోలీసులు అటుగా వచ్చిన కారును ఆపి తనిఖీలు చేపట్టారు. కారు డిక్కీలో రెండు బ్యాగ్‌ల్లో ఉంచిన 41 కిలోల డ్రై గంజాయి దొరికింది.

◆ గంజాయిని రవాణా చేస్తున్న చింతల్‌కు చెందిన నరేందర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా వైజాగ్‌కు చెందిన రాజేష్ గంజాయి పంపినట్లు అంగీకరించాడు. రాజేష్‌కు రూ.2.12 లక్షలు చెల్లించానని, అతను చెప్పిన విధంగా సుబాష్‌నగర్‌లో కారును అద్దెకు తీసుకుని మూసాపేట్‌లోని గూడ్స్‌షెడ్ వద్దకు వెళ్లగా ఇద్దరు వ్యక్తులు రెండు సంచుల్లో గంజాయిని ఇచ్చారని పేర్కొన్నారు.

◆ గతంలో స్టాక్‌మార్కెట్ లావాదేవీల్లో భాగంగా రాజేష్ పరిచయమయ్యాడని అందులో నష్టాలు చవిచూడటంతో గంజాయి విక్రయాలు చేపడితే సులభంగా డబ్బులు వస్తాయని రాజేష్ చెప్పడంతో ఈ దందాలోకి దిగినట్లు పేర్కొన్నాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు రూ.10లక్షలు విలువ చేసే గంజాయి, కారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

◆ కాగా గంజాయి సరఫదారు రాజేష్ పరారీలో ఉన్నాడని అతని కోసం గాలింపు చేపడుతున్నామని పోలీసులు పేర్కొన్నారు. గంజాయిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన బాచుపల్లి సీఐ నర్సింహారెడ్డి, ఎస్ఐ సాయినాథ్, కానిస్టేబుళ్లు రాజు, రాజేష్, కనకయ్యలను డీసీపీ అభినందించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

జీడిమెట్ల: ఒడిస్సా రాష్ట్రం నుంచి నగరానికి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర నేరస్తులు పోలీసులు అరెస్టు చేశారు. జీడిమెట్ల సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా మల్కాన్‌గిరి జిల్లాకు బాబుల బంజారా, అభిరామ్ పృష్టి ఇద్దరు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో గంజాయి దందాను ఎంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఒడిస్సా నుంచి ప్లాస్టిక్ బ్యాగ్‌లలో గంజాయిని ప్యాక్ చేసి తీసుకొచ్చారు. జీడిమెట్ల ఆర్టీసీ బస్టాప్ వద్ద విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు వారిద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40వేలు విలువ చేసే 8కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఒక్కసారిగా కుంగిన మ్యాన్‌హోల్..



సోమయ్యనగర్‌లోని సాయిబాబా కల్యాణ మండపం వద్ద కుంగిన మ్యాన్‌హోల్

జగద్గిరిగుట్ట: ఈ భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సోమయ్యనగర్‌లోని సాయిబాబా కల్యాణ మండపం సమీపంలో ప్రధాన రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్ కుంగి ప్రమాదకరంగా మారింది. సోమవారం ఆటోడ్రైవర్ అటుగా వెళ్లే సమయంలో ఈ మ్యాన్‌హోల్ కుంగింది. ఆటో డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. వీలైనంత త్వరగా కుంగిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్ దారుణ హత్య

- మృతదేహాన్ని మూటగట్టి ఇంటి ముందు పడేసిన దుండగులు
- దర్యాప్తు చేస్తున్న జీడిమెట్ల పోలీసులు



సురేష్ (ఫైల్)

జీడిమెట్ల: ఓ ఆటో డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. అంతమొందించిన దుండుగలే మృతదేహాన్ని గోనె సంచీలో మూటగట్టి ఇంటి ముందే మృతదేహాన్ని వదిలేయడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్‌లో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం, వెలిమెల గ్రామానికి చెందిన సురేష్ (28) 2016లో రేణుకను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరు కొన్నేళ్ల నుంచి సంజయ్‌గాంధీనగర్‌లో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. వారికి ఆరేళ్ల, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు ఆడ పిల్లలున్నారు. సురేష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తుండగా రేణుక ఇంటి వద్దనే ఉంటోంది.

◆ ఆదివారం భర్త సురేష్‌ను ఆహారం తీసుకు రమ్మని రేణుక బయటకు పంపింది. అర్ధరాత్రి అయినా సురేష్ ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ సైతం ఇంట్లో వదిలి వెళ్లినట్లు గుర్తించారు. సోమవారం తెల్లవారుజాము 5 గంటల ప్రాంతంలో ఇంటి ముందు గోనె సంచీలో మృతదేహం ఉన్నట్లు ఇంటి యజమాని గుర్తించాడు. దగ్గరకు వెళ్లి చూడగా సురేష్ రక్తపు మడుగులో ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

భార్యే హత్య చేయించిందా..!

మృతుడు సురేష్ హత్య వెనుక భార్య హస్తమున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మరి కొంత మంది వ్యక్తులతో కలిసి రేణుక పథకం ప్రకారం హత్య చేసి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో జీడిమెట్ల పోలీసులు రేణుకను కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు.